


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

పెరగనున్న కాలుష్య ముప్పు..!


టిజివి ఎస్ఆర్ఎఎసి పరిశ్రమ

కర్నూలు మండలం గొందిపర్ల గ్రామ పరిధిలోని టిజివి ఎస్ఆర్ఎఎసి (ఆల్కలిస్) పరిశ్రమలో రసాయనాల ఉత్పత్తి విస్తరణకు చర్యలు చేపడుతున్నారు. కొత్తగా పిటిఎఫ్ఇ, సిపివిసి, పిఎసి, హైడ్రోజన్ పెరాక్సైడ్ ప్లాంట్లను స్థాపించనున్నారు. వాటికి సంబంధించి పర్యావరణ అనుమతుల కోసం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ఈ ఉత్పత్తుల విస్తరణకు, కొత్త పాంట్లకు అనుమతులు ఇస్తే కాలుష్య ప్రమాదం పెరగనుందని ప్రజలు, పలు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు...

'టిజివి ఎస్ఆర్ఎఎసి' రసాయనాల ఉత్పత్తి విస్తరణకు చర్యలు
కొత్తగా పిటిఎఫ్ఇ, సిపివిసి, పిఎసి ప్లాంట్లు
వ్యతిరేకిస్తున్న స్థానికులు, పలు సంఘాలు
నేడు కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/క్రైం

టిజివి ఎస్ఆర్ఎఎసి పరిశ్రమ కర్నూలు మండలం గొందిపర్ల గ్రామ పరిధిలో 152.4 హెక్టార్లలో ఉంది. ప్రస్తుతం ఉన్న పరిశ్రమ సైట్ విస్తీర్ణంలోనే కాస్టిక్, కోరో మీథేన్ తయారీ సామర్థ్యాన్ని విస్తరించడానికి, పాలీ టెట్రా ఫోరో ఎథిలీన్ (పిటిఎఫ్ఇ), క్లోరినేటెడ్ పాలీ వినైల్ క్లోరైడ్ (సిపివిసి), పాలీ అల్యూమినియం క్లోరైడ్ (పిఎసి), హైడ్రోజన్ పెరాక్సైడ్ ప్లాంట్లను స్థాపించాలని ప్రతిపాదించారు. దీనికి సంబంధించి పర్యావరణ అనుమతుల కోసం బుధవారం ఉదయం 11 గంటలకు పరిశ్రమలోనే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ఈ పరిశ్రమలోని క్లోరోమీథేన్ ప్లాంట్‌లో ప్రస్తుతం రోజుకు 16.8 టన్నుల కార్బన్ టెట్రాక్లోరైడ్ ఉత్పత్తి చేస్తుండగా మరో 8.4 టిపిడి (టన్స్ పర్ డే) ఉత్పత్తిని పెంచనున్నారు. హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఉత్పత్తి 65.8 టిపిడి నుంచి 100.2 టిపిడికి పెంచనున్నారు. క్లోర్ - ఆల్కరీ ప్లాంట్‌లో కాస్టిక్ సోడా ఉత్పత్తి సామర్థ్యం 1420 టిపిడి నుంచి 1620 టిపిడికి, లిక్విడ్ క్లోరిన్ ఉత్పత్తి 840 టిపిడి నుంచి 1100 టిపిడికి పెంచనున్నారు. క్లోరో మీథేన్స్‌లో మిథైల్ క్లోరైడ్ 1.68 టిపిడి నుంచి 2.58కు, మిథిలిన్ క్లోరైడ్ 221.2 టిపిడి నుంచి 335కు, క్లోరోఫామ్ 110.6 టిపిడి నుంచి 170 టిపిడికి విస్తరించనున్నారు. హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఉత్పత్తిని 425.1 టిపిడి నంఉచి 500 టిపిడికి పెంచనున్నారు. కొత్తగా 40 టిపిడి సామర్థ్యంతో పాలీ టెట్రా ఫ్లోరో ఇథిలీన్, 200 టిపిడి సామర్థ్యంతో క్లోరినేటెడ్ పాలి వినైల్ క్లోరైడ్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. 100 టిపిడి సామర్థ్యంతో పాలీ అల్యూమినియం క్లోరైడ్ (పిఎసి) 100 టిడిపి హైడ్రోజన్ పెరాక్సైడ్ ప్లాంట్లు నెలకొల్పనున్నారు. 106 టిపిడి పిటిఎఫ్ఇ నుండి హైడ్రోక్లోరిక్ ఆమ్లం, 1.66 టిపిడి హైక్సాఫ్లోరో ప్రొపైలీన్, 62.4 సిపివిసి నుండి హైడ్రోక్లోరిక్ ఆమ్లం, 34.1 టిపిడి సల్ఫ్యూరిక్ ఆమ్లం, 33.4 టిపిడి సోడియం హైపోక్లోరైట్, 100 టిపిడి సిపివిసి నుంచి తక్కువ గ్రేడ్ పివిసి తయారీ ప్లాంట్లను కొత్తగా ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఈ పరిశ్రమ నుంచి కాలుష్య కారకాలు వెలువడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉత్పత్తుల విస్తరణకు, కొత్త పాంట్లకు అనుమతులు ఇస్తే కాలుష్య ప్రమాదం పెరగనుందని ప్రజలు, పలు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీటి వనరులపై తీవ్ర ప్రభావం

ఈ పరిశ్రమ విస్తరణ వల్ల కర్నూలు నగరానికి సమీపంలో ప్రవహిస్తున్న కృష్ణ , తుంగభద్ర నదుల నీటి వనరులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. పరిశోధనలో పిఎఫ్ఎఎస్ రసాయనం ప్రమాదాలు వెల్లడైన తర్వాత కూడా ఈ పరిశ్రమకు అనుమతిస్తే, కృష్ణా నది నీరు తాగడానికి పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది.



- వై.నగేష్, డివైఎఫ్ జిల్లా కార్యదర్శి.

అభ్యంతరాలు తెలియజేయవచ్చు

గొందిపర్ల గ్రామ పరిధిలో ఉన్న ఎస్ఆర్ఎఎసి పరిశ్రమ విస్తరణకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక కంపెనీ సమీపంలో చేపట్టనున్నాం. ప్రజల్లో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఈ కార్యక్రమానికి హాజరై తమ వినతులను తెలియజేయవచ్చు.



- పివి కిషోర్ రెడ్డి, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు.

ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలి

పరిశ్రమ యాజమాన్యం సమర్పించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో అనేక లోపాలు ఉన్నాయి. ప్రజలకు అవగాహన కల్పించే ముఖ్య సమాచారం అందులో లేదు. సంస్థ తయారు చేసే పాలిటెట్రాఫ్లోరోఇథలిన్ (పీటీఎఫ్ఈ) రసాయన ప్రక్రియలో పెర్ఫ్లోరోక్టానాయిక్ (పీఎఫ్ఎఎస్), కార్బన్ టెట్రాక్లోరైడ్ (సీసీఎల్4) వంటి ప్రమాదకరమైన రసాయనాలు వెలువడతాయి. ఈ రసాయనాల నిల్వ, వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి నివేదికలో ఎటువంటి సమాచారం లేదు. ఇటీవల అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో జరిగిన ప్రమాదంలో 17 మంది కార్మికులు మరణించారు. ఈ పరిశ్రమల తయారీలో ఉపయోగించే సర్ఫెక్టెంట్ల వల్ల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ పరిశ్రమ తెలంగాణ సరిహద్దులో ఉన్నందున, దీని ప్రభావం అక్కడి ప్రజలపై కూడా ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి తెలంగాణ ప్రజల అభిప్రాయాలను కూడా సేకరించాలి. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం.



- పిఎస్ రాధాకృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు.

ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలి

- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇకి ప్రజాసంఘాల వినతి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు ఆల్కలీస్ ఫ్యాక్టరీలో కొత్త రసాయన తయారీ విస్తరణ ద్వారా వచ్చే ప్రమాదాన్ని ప్రజలకు తెలియజేయకుండా లోపాయికారి ఒప్పందంతో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లడం ప్రజలను ప్రమాదంలోకి నెట్టడంతోపాటు, పర్యావరణాన్ని నాశనం చేయడమేనని ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ముందు ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ పిసిబి ఈఈ కిషోర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.


పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇకి వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెట్టుబడిదారులు ఎలాంటి ఆలోచన లేకుండా కేవలం లాభమే ధ్యేయంగా విష తుల్యమైన రసాయనాల తయారీకి ఒప్పందాలు కుదుర్చుకుంటారని, అలాంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ప్రజల ప్రాణాలను, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రామకృష్ణారెడ్డి, పిఎస్ రాధాకృష్ణ, భాస్కర్ రెడ్డి, ఎండి ఆనంద్ బాబు, శ్రీనివాసరావు, జి.రామకృష్ణ, షేక్షావలి, నాగన్న, చంద్రశేఖర్ రెడ్డి, డేవిడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ కోర్టు కేసులు పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించిన కోర్టు కేసులు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో భూ సేకరణ కేసుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కర్నూలు, ఆదోని, పత్తికొండ డివిజన్లకు సంబంధించి మండలాల వారీగా భూసేకరణ కేసులపై సమీక్షించారు. ఏ మండలంలో ఎన్ని భూసేకరణ సమస్యలు ఉన్నాయి..? ఎంత డబ్బు చెల్లించాల్సి ఉంది..? అందుకు సంబంధించి తీసుకున్న చర్యల గురించి కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణకు సంబంధించి కోర్టు కేసులపై వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. పరిహారం చెల్లింపుకు సంబంధించి అవసరమైన నిధుల కేటాయింపు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. ఈ అంశంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్‌కి సూచించారు. శాఖల వారీగా ఏపి కేసులు ఉన్నాయి..? ఎంత డబ్బు చెల్లించాలన్న వివరాలతో నివేదికను సిద్ధం చేయాలని డిఆర్ఓను ఆదేశించారు. ఈ నివేదికను సంబంధిత శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, సిసిఎల్ఎ, జిఏడీ, ఏజిపిలకు పంపాలని తెలిపారు. భూ సేకరణ కేసులకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితిని సంబంధిత ఆర్డీఓలకు పంపించాలని భూ సేకరణ సెక్షన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు, అనూరాధ, అజయ్ కుమార్, జిపి, ఏజిపిలు పాల్గొన్నారు..

తాగునీటి ఎద్దడి లేకుండా చేయాలి : కలెక్టర్

జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఆర్డబ్ల్యు, ఎంపిడిఓలు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజనీర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఈఓపిఆర్డిలతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటికి సంబంధించి ఇది కీలకమైన సమయమని, జూలై మాసం వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రక్షిత మంచినీటి పథకాలు, ట్యాంకులు, ఫిల్టర్లు, పంపిణీ వ్యవస్థ సరిగా ఉండేలా చూసుకోవాలన్నారు.. పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులను వినియోగించుకుని అవసరమైన వాటికి వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. ఇంకా నిధులు అవసరమయితే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. పట్టణ ప్రాంతాలలో నీటి సమస్య గురించి కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లను అడిగి తెలుసుకున్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్ఇ బాలచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- నగరంలోని వివిధ ప్రాంతాల్లో కమిషనర్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని అశోక్ నగర్, ఆనంద్ థియేటర్ సమీపంలోని శ్రీ బసవ సర్కిల్, గడియారం ఆసుపత్రి, అమీర్ హైదర్ నగర్ ప్రాంతాల్లో కమిషనర్ విస్తృతంగా పర్యటించారు. హంద్రీనదిలో జరుగుతున్న ముళ్ళ పొదల తొలగింపు పనులను కమిషనర్ పరిశీలించారు. ఆనంద్ థియేటర్ సమీపంలో కిసాన్ ఘాట్ వెళ్ళు మార్గాన కూడలి ఏర్పాటుకు, గడియారం ఆసుపత్రి ఆధునికీకరణ పనులను చేపట్టడానికి ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అక్కడే జరుగుతున్న పలు అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే అమీర్ హైదర్ నగర్ కాలనీలో రహదారుల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాజ్‌విహార్ సమీపంలో హంద్రీ నదిలో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, డిఈఈ గంగాధర్, పారిశుద్ధ్య తనిఖీదారులు వలి, మునిస్వామి, లోకేష్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.


కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ యస్.రవీంద్రబాబు

సైనికుల త్యాగాలను మరచిపోలేం : డిఇఒ

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డిఇఒ

దేశ రక్షణలో సైనికుల త్యాగాలను మరచిపోలేమని డిఇఒ శ్యామూల్ పాల్ తెలిపారు. జై జవాన్ కల్చరల్ ఫెస్ట్ లో భాగంగా మంగళవారం రాత్రి జరిగిన నృత్య ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భరతమాత చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి నాట్యాచార్యులు నారాయణస్వామి, నాగ సాయి, ప్రదీప్, దేవిశ్రీ, కరీముల్లా, రోహిత్‌ను సత్కరించి పారితోషికం అందించారు. అనంతరం డిఇఒ శ్యామూల్ పాల్ మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వారి వీరమరణాన్ని కొనియాడారు. ఈనెల 16న సాయంత్రం 5 గంటలకు జిల్లా కలెక్టరేట్ నుంచి టిజివి కళాక్షేత్రం వరకు భారత సైనికులకు మద్దతుగా ర్యాలీ ఉంటుందని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు భారీ ఎత్తున పాల్గొనాలని కోరారు. టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య స్వాగతం పలుకుతూ 16న ర్యాలీకి కళాకారులు, నగర ప్రజలు పాల్గొనాలని కోరారు. నగరంలోని వివిధ కళా సంస్థల నాట్య ఆచార్యులకు సంబంధించిన విద్యార్థులు దేశభక్తి గీతాలకు నృత్య ప్రదర్శన చేసి అలరించారు. రాజారత్నం, సంఘ ఆంజనేయులు, నంది అవార్డు గ్రహీత మహ్మద్ మియా, యాగంటీశ్వరప్ప, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన సాధన అవసరం

- రాష్ట్రస్థాయి ఉషు పోటీలను ప్రారంభించిన మాజీ ఎంపీ టిజి.వెంకటేష్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

క్రీడాకారులు క్రమశిక్షణతో కూడిన సాధన చేస్తే లక్ష్యాలను సాధించవచ్చని మాజీ ఎంపీ టిజి.వెంకటేష్ తెలిపారు. మంగళవారం నగరంలోని బిర్లాపురంలో ఉన్న శ్రీలక్ష్మి టిజి.వెంకటేష్ కల్యాణ మండపంలో జిల్లా ఉషు సంఘం అధ్యక్షులు డాక్టర్ శంకర్ శర్మ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి 10వ సబ్ జూనియర్, 11వ జూనియర్, సీనియర్ పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, రాష్ట్ర ఉషు సంఘం అధ్యక్షు, కార్యదర్శులు ఆది విష్ణు, నరసింహ రావు, జిల్లా ఒలింపిక్ సంఘం సెక్రటరీ విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉషు మార్షల్ ఆర్ట్స్‌ను నేర్చుకుంటే ఆపద సమయాల్లో తమను తాము కాపాడుకోవడంతో పాటు ఇతరులను రక్షించేందుకు దోహదపడుతుందన్నారు. క్రీడాకారులు స్ఫూర్తి ప్రదర్శించి పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా ఉషు సంఘం అధ్యక్షులు డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడారు. క్రీడాకారులు స్నేహభావాన్ని అలవర్చుకొని గెలుపోటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు. రాష్ట్ర ఉషు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆది విష్ణు, నరసింహ రావు మాట్లాడుతూ... 11 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. పోటీల నిర్వాహక కార్యదర్శి టి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉషు సంఘం సంయుక్త కార్యదర్శి శివకుమార్, ఎన్ఐఎస్ శిక్షకులు సాయి మోహన్, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, జిల్లా స్కేటింగ్ సంఘం సెక్రటరీ సునీల్ కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎంపీ టిజి.వెంకటేష్

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు

- సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికి స్టిక్కర్లు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అదానీ కంపెనీకి లాభాలు పెంచడం ముఖ్యమా.. ప్రజలకు కరెంటు భారాలు పడకుండా చేయడం ముఖ్యమా.. ప్రజలకు కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని సిపిఎం డిమాండ్ చేసింది. మంగళవారం కర్నూలు నగరంలోని 23వ వార్డు శ్రీరామ నగర్‌లో సిపిఎం వార్డ్ కమిటీ ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్ మాకొద్దు కరెంటు ఛార్జీలు తగ్గించాలి అనే స్టిక్కర్లను ప్రజలు చైతన్యం చేస్తూ ఇంటింటికి స్టిక్కర్లను అంటించి అంటించారు. కరెంటు ఛార్జీలు తగ్గించాలంటూ స్మార్ట్ మీటర్ వద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ప్రజలు స్వచ్ఛందంగా వారింటికి స్టిక్కర్లు వేసుకొని నిరసన తెలియజేశారు. సిపిఎం వార్డు నాయకులు ఎస్.అస్లాం అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, నగర కార్యదర్శి వర్గసభ్యులు ఆర్ నరసింహులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2020 సంవత్సరంలో తీసుకువచ్చిన నూతన విద్యుత్ విధానం వల్ల ప్రజల మీద విద్యుత్ భారాలు విపరీతంగా పడుతున్నాయన్నారు. గతంలో ఒక యూనిట్ ధర రూ.1.90ఉండగా పారిశ్రామికవేత్త ఆదాని కంపెనీ లాభాల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2.49కి సెకి ఒప్పందం చేసుకొని రాష్ట్ర ప్రజల పైన 50 పైసలు యూనిట్‌పై అదనపు భారం మోపారన్నారు. స్మార్ట్ మీటర్ ఇంటికి పెడితే సెల్ ఫోన్‌కు రీఛార్జ్ చేసుకున్న విధంగా ముందుగానే డిపాజిట్ చెల్లించి కరెంటు వాడుకోవలసిన పరిస్థితి ఉంటుందని, రీఛార్జ్ అయిపోయిన వెంటనే కరెంటు కట్ అవుతుందని తెలిపారు. ఒక రోజులో ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు సాయంత్రం 6 గంటల నుండి 10 గంటల వరకు కరెంటు ఎక్కువగా వాడతారు కనుక యూనిట్ ధర ఎక్కువగా ఉంటుందన్నారు. ఒక రోజు 24 గంటల్లో యూనిట్ ధర మూడు రకాలుగా మారుతుందని, ఇది చాలా ప్రమాదకరమైన స్మార్ట్ మీటరు అందుకే ఈ మీటర్ వద్దని సిపిఎం పార్టీ కోరుతుందని తెలిపారు. పాత కరెంటు పద్ధతినే అమలుచేయాలని డిమాండ్ చేశారు. టిడిపి అధికారంలోకి రాకముందు స్మార్ట్ మీటరు చాలా ప్రమాదకరం దీన్ని పగలగొట్టండి అనిచెప్పి నినాదం ఇచ్చి ఇప్పుడు ప్రజల కు బలవంతంగా స్మార్ట్ మీటర్ పెట్టడం చాలా దుర్మార్గం అన్నారు. సిపిఎం చేపట్టే పోరాటాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాలనీ ప్రజలు ఆర్ రాజు, మహమ్మద్ గౌస్, ఉమ భాస్కర్, చాంద్ బాషా, ఆచారి, నళిని, లీలావతి, వెంకటేశ్వరమ్మ, కోటమ్మ, లక్ష్మీదేవి, సుశీలమ్మ పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ముగిసిన జాతీయ స్థాయి బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నన్నూరు గ్రామంలో ఎపిఎం చర్చి ప్రతిష్టాపన సందర్భంగా మంగళవారం జాతీయస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు దాదాపు 14 జతలు పాల్గొన్నాయి. పోటీలను చర్చి పాస్టర్ ప్రసాద్ ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన బండలాగుడు పోటీల్లో గెలుపొందిన ఎద్దుల జత యజమానులకు బహుమతులను చర్చిలో అందజేశారు. మాజీ సర్పంచ్ శ్రీరెడ్డి చిన్నారెడ్డి, సర్పంచ్ బ్రహ్మయ్య, బహుమతుల దాతలు గౌడుల పెద్ద రాముడు, శ్రీనివాసులు, సన్నాసి అన్నయ్య, వేముల నారాయణ, నాగమద్దయ్య, పూజారి నారాయణ, సన్నాసి సురేష్, వడ్డెమాన్ ఈరన్న పాల్గొన్నారు. వ్యాఖ్యాతగా వాడాల రామానాయుడు వ్యవహరించారు. నిర్వాహకులు రాము కృష్ణ, ఇమ్మానుయేలు, నాగరాజు, సురేష్ పాల్గొన్నారు.


బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

సిబిఎస్ఇ ఫలితాల్లో 'రిడ్జ్' ప్రతిభ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



సిబిఎస్ఇ పదో తరగతి ఫలితాల్లో రిడ్జ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని పాఠశాల సిఇఒ జి.గోపినాథ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. మొత్తం 111 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 90శాతానికి పైగా 30 మంది, 80 శాతానికిపైగా 63 మంది, 70 శాతానికిపైగా 84 మంది, 60 శాతానికిపైగా 102 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. టి.కేదార్ రెడ్డి 486, ఎస్.సందీప్ రెడ్డి 479, టి.వి.తేజోదయ్ 478, వి.దక్ష 475, ఎస్.గౌతం 474, పెరుగు లక్ష్మీ గాయత్రి 473 మార్కులతో ప్రతిభ చాటారన్నారు. ప్రతిభను చాటిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపకులను, విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల సిఇఒ జి.గోపినాథ్, కో సిఇఒ సౌమ్య గోపినాథ్, డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ ఎ.రాజ్ కమల్, కోఆర్డినేటర్ హరికృష్ణ అభినందించారు.

మొదటి బ్యాచిలోనే సంచలనం

- క్రైడో ది స్కూల్ వందశాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు బి.తాండ్రపాడులోని 'క్రైడో ది స్కూల్' ప్రారంభించిన మొదటి బ్యాచిలోనే 10వ తరగతి విద్యార్థులు సిబిఎస్ఇ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ కావ్య లక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. పాఠశాల విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల నిబద్ధత, పాఠశాల నిర్వహణలో ఉన్న నాణ్యతకు ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఈ సంవత్సరం టాపర్లుగా ఆర్.పవిత్ర 92 శాతం, కె.మోక్షిత్ రావు 91 శాతం, ఆర్.మంజునాథ్ నాయక్ 91 శాతం, కె.ప్రజ్ఞన్ 90 శాతం, కె.ప్రణీత్ 90 శాతం సాధించినట్లు చెప్పారు. మొదటి బ్యాచి నుంచే తమ విద్యార్థులు విజయాన్ని సాధించడం గొప్ప గౌరవమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు తమ శిక్షణ విధానం అలాగే కొనసాగుతుందని చెప్పారు.



జిజిహెచ్‌లో రెండు అరుదైన శస్త్ర చికిత్సలు

- రోగులను డిశ్చార్జ్ చేసిన జనరల్ సర్జన్ వైద్యులు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిజిహెచ్‌లో రెండు అరుదైన నిర్వహించిన రోగులను జనరల్ సర్జన్ వైద్యులు మంగళవారం డిశ్చార్జ్ చేశారు. జెసిబి ఢీ కొట్టిన సంఘటనలో ఒక వ్యక్తికి పొట్టను చీల్చి పేగులకు పెద్ద లోతైన గాయం, అనంతపురం జిల్లాకు చెందిన మరో వ్యక్తికి మల ద్వారం వద్ద మలవిసర్జన సమస్య తీవ్రంగా ఉంది. ఈ రెండు కేసులను కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి బంధువులు తీసుకురాగా ఆ ఇద్దరు రోగులకు జనరల్ సర్జన్ ఐదవ వార్డు ప్రొఫెసర్ డాక్టర్ మాధవి శ్యామల ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రారెడ్డి, డాక్టర్ శృతి శస్త్ర చికిత్స చేసి వారికి పునర్జన్మ ప్రసాదించారు. కోలుకున్న తర్వాత రోగులను మంగళవారం డిశ్చార్జి చేశారు. జనరల్ సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవి శ్యామల మాట్లాడుతూ బండి ఆత్మకూరుకు చెందిన షేక్ తౌఫిక్ (17 సంవత్సరాలు) బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న జెసిబి తౌఫిక్ పొట్టను పేగులను చీల్చివేసిందని వారు హుటాహుటిన ఆర్ రోజు జిజిహెచ్‌లో అడ్మిట్ అయ్యారని తెలిపారు. జెసిబి బలంగా ఢీ కొట్టడంతో పొట్టలోని కండరాలు, పొట్ట, చిన్న పేగు, పెద్ద పేగు అన్ని పీకేసినట్లు కట్ అయిపోయాయని తెలిపారు. లోపల కండరాలు కట్ అయి కిడ్నీదాకా డ్యామేజ్ అయిందని వివరించారు. దీనిని అదే రోజు రాత్రి 10 గంటలకు ఆపరేషన్ ప్రారంభిస్తే తెల్లవారుజామున ఐదున్నర గంటల వరకు సుమారు 8 గంటల పాటు ఆపరేషన్ చేసి పనికి రానిది తొలగించి, కుట్లు వేసినట్లు తెలిపారు. ఆపరేషన్ చాలా సమయం పట్టిందని తెలిపారు. అతనికి ఫెల్విక్ బోన్ కూడా ఫ్రాక్చర్ అయింది. అతను 21 రోజులు ఐసియులో ఉండి 43 రోజులకు కోలుకోగా ఈరోజు డిశ్చార్జ్ చేశామని తెలిపారు. అంత పెద్ద లోతైన గాయంతో కోలుకోవడం చాలా కష్టమైన విషయమని ఈ చికిత్స ప్రైవేట్ హాస్పిటల్లో లో అయితే లక్షల్లో ఖర్చు అవుతుందని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్లో ఉచితంగానే చేశామని తెలిపారు. అనంతపురం జిల్లా కదిరి పట్టణానికి చెందిన విశ్వగోపాల్ (15 సంవత్సరాలు) పుట్టినప్పుడే మలద్వారం లేకుండా పుట్టారని అప్పుడే జిజిహెచ్‌లోనే శస్త్ర చికిత్స చేసి మలద్వారం పెట్టారని, రంధ్రం చిన్నదిగా కావడంతో మలం బయటికి పోయేది కాదని వారికి తెలిసేదికాదని తెలిపారు. అనేక ప్రైవేట్ హాస్పిటల్లో చూపించుకున్నా నయం కాకపోవడంతో ఏప్రిల్ 18 వతేదీ జిజిహెచ్‌లో అడ్మిట్ అయ్యారని తెలిపారు. వైద్య పరీక్షల్లో ఆనల్ స్టినోసిస్, స్వీవెల్ స్టినోసిస్ సమస్య ఉన్నట్లు తేల్చారు. అతని మలద్వారం వెడల్పు చేసి కండరాలను బలపరిచేందుకు ఈ ఆపరేషన్ మే 7 వతేది విజయవంతంగా చేసామని తెలిపారు. కోలుకున్న ఇద్దరు రోగులకు కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో అనస్థీషియా ప్రొఫెసర్ శివ నాయక్, డాక్టర్ సోమశేఖర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మురళీ ప్రభాకర్, డాక్టర్ జ్యోత్స్నలు పాల్గొన్నారు.


డిశ్చార్జి ఇస్తున్న వైద్యులు


సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధి పీడీ వెంకట రమణయ్య

ఫారంపాండ్లు ఏర్పాటు చేసుకోవాలి

- ఉపాధి పీడీ వెంకటరమణయ్య

ప్రజాశక్తి - కోసిగి

మండలంలో ఉన్న ప్రతి రైతూ పొలాల్లో ఫారంపాండ్లను ఏర్పాటు చేసుకోవాలని ఉపాధి పీడీ వెంకటరమణయ్య తెలిపారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఏపీడీ లోకేష్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీవో ఖాలిక్, హార్టికల్చర్ అధికారుల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ ఉపాధి పనులు చేయించి, లేబర్ రిపోర్టు పెంచాలన్నారు. ఫారంపాండ్లు ఏర్పాటు చేసుకుంటే రాబోయే వర్షాకాలంలో నీరు నిల్వ ఉండి, పంటలకు, మూగజీవాలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. హార్టికల్చర్ ద్వారా రైతులకు అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రైతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం పులికనుమ రిజర్వాయర్‌ను సందర్శించి, నీటి నిల్వను పరిశీలించి, గుడికల్ చెరువుకు ఈనెల 23లోపు అవసరమైన నీటిని తెప్పించేవడానికి సంబంధిత అధికారులతో చర్చించారు. జనవాసి ఫారాన్ని సందర్శించి అవసరమైన మొక్కలు, ప్లాంటేషన్ డ్రైవ్ కోసం ఏర్పాటు చేశారు. డిఇఇ నీరజ, ఎఇ శరత్ చంద్ర హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పార్కు రోడ్డు, ట్యాంక్ బండ్ రోడ్డు, గంజెళ్ల రోడ్డు, పలు ఏరియాల్లో పారిశుధ్య పనులు పరిశీలించారు. శ్రీనివాస సర్కిల్ అన్న క్యాంటీన్‌లో భోజన పంపిణీ తనిఖీ చేశారు. పట్టణంలోని కలుగోట్ల రోడ్డులో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణం (రూ.36 లక్షలు), డ్రెయిన్ నిర్మాణ (రూ.25 లక్షలు) పనులను పరిశీలించారు. అలాగే ఎస్సీ శ్మశాన వాటిక వద్దన ఉన్న డ్రెయిన్ నిర్మాణం (రూ.25 లక్షలు) పనులు పరిశీలించారు. ఎఇ మదన్ కుమార్ పాల్గొన్నారు.


పులికనుమ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన గోనెగండ్ల మండలం కులుమాల గ్రామంలో చోటు చేసుకుంది. కులుమాల గ్రామానికి చెందిన ఏసన్న (39) రోజులాగే మంగళవారం ఉదయం గ్రామంలో ఉపాధి హామీ చట్టం ద్వారా చేపట్టిన ఫీడర్ ఛానల్ పనులకు వెళ్లారు. పని చేస్తుండగా అకస్మాత్తుగా ఏసన్నకు గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. తోటి కూలీలు, గ్రామస్తులు ఏసన్న మృతదేహాన్ని ఇంటికి తరలించారు. సమాచారం తెలిసిన వెంటనే ఎంపిడిఒ మణి మంజరి ఆదేశాల మేరకు ఏపీవో మహ్మద్ బాషా మృతుని ఇంటికి వెళ్లి ఏసన్న మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. మృతునికి భార్య సరోజమ్మ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పేద కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మృతి చెందడంతో కుటుంబాన్ని ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.


మృతదేహాన్ని సందర్శిస్తున్న ఏపీవో మహ్మద్ బాషా


ఏసన్న (ఫైల్)

దర్గాలో అన్నదానం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీఉగ్రప్పర ఖాదర్ లింగ స్వామి దర్గాలో జియారత్ కార్యక్రమం సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. మంగళవారం ఉరుసు ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖాదర్ లింగస్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో జియారత్ నేపథ్యంలో దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. ఫకీర్ సాబ్‌ల సందడితో దర్గాలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గంధాన్ని కర్ణాటకలోని గుల్బర్గాలో ప్రసిద్ధి చెందిన ఖాజా బందే నమాజ్ దర్గాకు భక్తుల ఆధ్వర్యంలో తీసుకెళ్లారు. దర్గా ధర్మకర్త మున్నా పాషా మాట్లాడుతూ... ఉత్సవాలకు సహకరించిన పోలీసు, రెవెన్యూ, పంచాయతీ తదితర శాఖ అధికారులకు అభినందనలు తెలిపారు.


గంధం తీసుకెళ్తున్న దృశ్యం

గాలివాన బీభత్సం

- విరిగి పడిన చెట్లు
- మఠంలో తీవ్ర నష్టం

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామంలో సోమవారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించింది. సోమవారం రాత్రి 8 గంటల నుంచి మంగళవారం తెల్లవారుజామున 4 గంటల వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షానికి గాలి తోడై ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. విద్యుత్ లేకపోవడంతో చిమ్మ చీకటిలో ఏం జరుగుతుందో, గాలికి ఏ వస్తువు వచ్చి మీద పడుతుందోన్న భయంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. గాలివాన బీభత్సానికి కోట వీధిలో మసీదు ఆవరణలో ఉన్న వేప చెట్టు భారీ కొమ్మలు విరిగి పడ్డాయి. అలాగే నందవరం నుంచి ఎమ్మిగనూరు వెళ్లే రహదారిలో పెద్ద చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. దీనివల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే కొన్నిచోట్ల పొలాల్లో చెట్లు విరిగి నేలవాలాయని రైతులు పేర్కొంటున్నారు. ఎమ్మిగనూరుకు వెళ్లే రహదారిలో వ్యాపారం కోసం రేకులతో నిర్మించుకున్న షెడ్డు గాలి ధాటికి సుమారు 20 మీటర్ల దూరంలో వెళ్లి పడిపోయింది. అది చాలావరకు విరిగిపోయి మరమ్మతులకు రాని విధంగా తయారయింది. నాగల దిన్నె వెళ్లే రహదారిలో ఉన్న మఠంపై గాలి వాన ఉగ్రరూపాన్ని చూపించిం ది. గాలివాన ధాటికి రాతితో నిర్మించిన స్తంభాలు


నందవరం మఠంలో కింద పడిన బోదెలు

కుప్పకూలాయి. భక్తుల కోసం, వివాహాలు జరుగుతున్న సమయంలో ప్రజలకు నీడ ఉండాలని భావించి నిర్మించిన రేకుల షెడ్డు నేల మొట్టమయింది.

మఠంలో రూ.2 లక్షల ఆస్తి నష్టం

- నటరాజ్ గౌడ్, మఠం అధికారి



గాలివాన సృష్టించిన బీభత్సంతో సుమారు రూ.2 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించింది. దాతల సహకారంతో ఒక్కో స్తంభం రూ.60 వేల వ్యయంతో 4 స్తంభాలు నిర్మించాం. వాటిపై శ్లాబ్ వేసే సమయంలో ఈ సంఘటన జరగడం బాధాకరం. స్తంభాలపై ఉన్న బోదెలు పడిపోవడం వల్ల నేలపై పరిచిన బండలు పగిలిపోయాయి. రూ.50 వేల వ్యయంతో నిర్మించిన రేకుల షెడ్డు ధ్వంసమయింది. విద్యుత్ తీగలు తెగి వైరింగ్ సిస్టం పూర్తిగా నాశనమైంది.

హోళగుందలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. పిడుగుల శబ్దానికి మండల ప్రజల భయాందోళనకు గురయ్యారు. వర్షం ఓ మోస్తరుగా కురిసినా పిడుగులు మాత్రం భయంకర శబ్దంతో పడ్డాయి. మండలంలోని పెద్ద గోనెహాలు గ్రామం బీసీ కాలనీలో ఓ చెట్టుపై పిడుగు పడగా చెట్టుకు చీలికలు ఏర్పడ్డాయి. ఈ వర్షానికి దుక్కి దున్నుకోవడానికి మంచి పదునయినట్లు రైతులు పేర్కొంటున్నారు.

ఊపిరి పీల్చుకున్న మామిడి రైతులు

గాలితో కూడిన వర్షం కురవక పోవడంతో మామిడి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఎక్కడా మామిడి కాయలు నేలకొరగలేదని ఆనందం వ్యక్తం చేశారు. గతేడాది గాలివాన కురవడం వల్ల మామిడి పంట మొత్తం నేలకొరిగి పూర్తిగా నష్టపోయామని, ప్రస్తుతం సీజన్ సగంలో ఉందని, ఇంకో 15 రోజులు గాలితో కూడిన వర్షం కురవకపోతే లాభాల బాటలో ఉంటామని మామిడి రైతులు పేర్కొంటున్నారు.



పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

ఆస్పరి : మండలంలోని ములుగుందం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి శంకర బండ గోవిందు (30) పిడుగుపాటుకు గురై మంగళవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... ములుగుందం గ్రామ వాసి గోవిందు గ్రామంలో గొర్రెలకు మేత, నీళ్లు లేకపోవడంతో ఆదోని మండలం నాన్నపురంకు వలస వెళ్లారు. ఉరుములు, పిడుగు పాటుతో వర్షం రావడంతో గ్రామ సమీపంలో పొలంలో ఒక్క చెట్టు దగ్గరకు వెళ్లారు. గోవిందుతో పాటు మరో వ్యక్తి గొర్రెలను తోలుకొని వెళ్లి నిలబడగా ఒక్కసారిగా పెద్ద పెద్ద శబ్దాలతో పిడుగు పడి గోవిందు అక్కడికక్కడే మృతి చెందారు. గొర్రెలు, మరో గొర్రెల కాపరి స్పృహ కోల్పోయి పడిపోయారు. లేచి చూస్తే అప్పటికే గోవిందు మృతి చెందారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని గోవిందును ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య రంగ వేణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. గోవిందు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పిడుగు పాటుకు ఎద్దు మృతి

మండలంలోని ముత్తుకూరు గ్రామంలో ఉరుములు, మెరుపుల ధాటికి ఎద్దు మృతి చెందింది. రైతు మల్లికార్జున రెడ్డి ఎద్దులను వాము దొడ్డిలో కట్టేశారు. వర్షంతో పాటు పెద్ద పెద్ద శబ్దాలతో ఉరుములు, పిడుగు పాటుకు గురై ఒక ఎద్దు మృతి చెందింది. రూ.1.80 లక్షలు పెట్టి ఎద్దులు కొనుగోలు చేసినట్లు రైతు తెలిపారు. సుమారు రూ.90 వేల నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

సిబిఎస్ఇలో వంద శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్




సిబిఎస్ఇ 12, 10వ తరగతి ఫలితాల్లో బన వాసి జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. 12వ తరగతిలో 36కి 36 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, పదో తరగతిలో 82కి 82 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతిలో సోషల్, సైన్స్ సబ్జెక్టుల్లో ఐదుగురు విద్యార్థులు 100 మార్కులు, గణితంలో ఇద్దరు విద్యార్థులు 100 మార్కులు సాధించారు. 12వ తరగతిలో దీప్తి ప్రియ 93.33 శాతంతో విద్యాలయంలో మొదటి ర్యాంకును సాధించగా, 10వ తరగతిలో రవి త్రయిని 97.2 శాతంతో టాపర్‌గా నిలిచారని విద్యాలయ ప్రిన్సిపల్ ఇ.పద్మావతి మంగళవారం తెలిపారు.

ది ఎథీనా స్కూల్ ప్రతిభ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్





పదో తరగతి సిబిఎస్ఇ ఫలితాల్లో ది ఎథీనా స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ ఏడాది కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ డైరెక్టర్లు అనూప్, ఐశ్వర్య, ప్రిన్సిపల్ కెబి.జ్యోతి తెలిపారు. వారు మాట్లాడుతూ... టి.శ్రుతి హాసిని 487/500 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. దాసరి సంజయ్ కుమార్ 484, చక్రం భువనేష్ 482, జంపాల హర్షిత 479, తురిమెల్ల సాయి హరిని 478 మార్కులు సాధించారని చెప్పారు.

సెయింట్ జోసెఫ్ ప్రతిష్టాత్మక ఫలితాలు

- మ్యాథ్స్‌లో ఐదుగురు, సైన్స్‌లో ఒకరికి వంద మార్కులు

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్





పదవ తరగతి సిబిఎస్ఇ ఫలితాల్లో సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ స్కూల్ విద్యార్థులు ప్రతిష్టాత్మక ఫలితాలు సాధించారని పాఠశాల డైరెక్టర్లు అనూఫ్, ఐశ్వర్య తెలిపారు. మంగళవారం వారు మాట్లాడారు. పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా, గణితంలో ఐదుగురు, సైన్స్‌లో ఒకరు వంద మార్కులు సాధించినట్లు తెలి పారు. బి.జశ్వంత్ శౌర్య 486 మార్కులు (మ్యాథ్స్‌లో వందకు వంద మార్కులు) సాధించి టాపర్‌గా నిలిచినట్లు చెప్పారు. ఎ.నమ్రత 485 మార్కులు (మ్యాథ్స్‌లో వందకు వంద మార్కులు), ఎస్.సాయి చైతన్య రెడ్డి 483 మార్కులు (మ్యాథ్స్, సైన్స్‌లో వందకు వంద మార్కులు) సాధించారన్నారు.

కట్టమంచి విద్యార్థినికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సిబిఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో నగర సమీపాన దిన్నె దేవరపాడులో గల కట్టమంచి సెకండరీ పాఠశాల (శ్రీ చైతన్య అకడమిక్ మేనేజ్మెంట్) విద్యార్థి డి.లాస్యరెడ్డి 496/500 మార్కులు సాధించి స్టేట్లోనే మొదటి స్థానంగా నిలిచి, జిల్లా స్థాయిలో ప్రభంజనం సృష్టించింది. ఇందుకు గాను ఆ విద్యార్థినిని శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం, సిబ్బంది అభినందించారు. జిల్లా ఎజిఎం సురేష్, పాఠశాల ఆర్ఐ రంగారెడ్డి, ప్రిన్సిపల్ కీర్తి, డీన్ పవన్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థినిని అభినందించారు.

లక్ష్మీనారాయణ హత్య కేసులో నారాయణ అరెస్టు

ప్రజాశక్తి-ఆలూరు

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ లక్ష్మీనారాయణ హత్య కేసులో గుమ్మనూరు నారాయణను అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా తెలిపారు. మంగళవారం ఆలూరు పోలీసు సర్కిల్ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. లక్ష్మీనారాయణ హత్య కేసులో నిందితులు రాజేష్, గౌసియా, సౌభాగ్యాలకు హత్యలో సహకరించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. హత్యకు ఉపయోగించే టిప్పర్ కొనడానికి రూ.2.50 లక్షలతో పాటు హత్య అనంతరం మరో రూ.1.50 లక్షలు ఇచ్చారన్నారు. లక్ష్మీనారాయణకు, గుమ్మనూరు నారాయణకు మధ్య రైల్వే కాంట్రాక్టు కమీషన్ విషయంలో మనస్పర్ధలు ఉన్నాయని తెలిపారు. కొన్ని పంచాయితీల్లోనూ ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని లక్ష్మీనారాయణ హత్య నిందితులకు సహకరించారని తెలిపారు. గుమ్మనూరు నారాయణను మంగళవారం ఉదయం ఇంటి వద్ద అరెస్టు చేసి సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గుమ్మనూరు నారాయణ ప్రస్తుత గుంతకల్ ఎమ్మెల్యే, మాజీమంత్రి గుమ్మనూరు జయరాంకు సోదరుడు. డీఎస్పీ వెంకట్రామయ్య, సిఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐలు ప్రదీప్ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా



బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ ప్రతిభ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ (నన్నూరు) విద్యార్థులు పదో తరగతి సిబిఎస్ఇ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మల్లికార్జున ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. మంది విద్యార్థులు 90 శాతానికి పైగా, మరో 13 మంది విద్యార్థులు 80 శాతానికి పైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించారని అన్నారు. ఈ ఫలితాలు విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించేందిచేలా తమ పాఠశాల కృషి చేస్తుందని చెప్పారు.

బిల్లులు చెల్లించకుంటే ఎలా..?

- కౌన్సిలర్ సందీప్ రెడ్డి
- పాస్ పాస్ అంటూ ఆమోదం

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరైన వారికి భోజనం వడ్డిస్తే వారికి బిల్లులు చెల్లించుకుంటే ఎలా అంటూ కౌన్సిలర్ సందీప్ రెడ్డి నిలదీశారు. మంగళవారం మున్సిపల్ ఇన్‌ఛార్జీ ఛైర్మన్ ముల్లా మహ్మద్ గౌస్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. అజెండాలోని అంశాలను 'పాస్.. పాస్' అంటూ ఏకపక్షంగా తీర్మానం చేశారంటూ టిడిపి కౌన్సిలర్ పార్వతి ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలర్ సందీప్ రెడ్డి మాట్లాడుతూ... అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదోని పర్యటన సందర్భంగా భోజన ఏర్పాట్ల కోసం ఆహారం సరఫరా చేసిన రేణుకాంబ హోటల్ యాజమానికి ఇంతవరకు బిల్లు చెల్లించకపోవడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. ఎన్నికలసందర్భంగా ఓటుహక్కుపై ప్రచారం చేసేందుకు మైకుల బాడుగ సుమారు రూ.2 లక్షలు చెల్లించాలని, ఈ అంశాన్ని అజెండాలో పొందుపరచడాన్ని మెజార్టీ వైసిపి కౌన్సిలర్లు వ్యతిరేకించారు. ప్రభుత్వానికి సంబంధించిన విషయమని కౌన్సిలర్లు ఆమోదింపజేయాలని కమిషనర్ కృష్ణ విన్నవించినా కౌన్సిలర్లు ససేమిరా అనడంతో వాయిదా పడింది. అధికారులకు అనుకూలంగా ఉన్న బిల్లులు మాత్రం అజెండాలో పెడుతున్నారని కౌన్సిలర్లు పేర్కొన్నారు. రేణుకాంబ హోటల్ యజమానికి సంబంధించిన బిల్లుల చెల్లింపుపై కూడా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. అత్యవసరం కోసం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాతో ప్రయోజనం ఉండేదని, ఎందుకు నిలిపేశారని కమిషనర్ కృష్ణను కౌన్సిలర్లు నిలదీశారు. నీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్త చర్యగా నీటి సరఫరా ట్యాంకర్ల విషయాన్ని నిలిపేసినట్లు కమిషనర్ వివరణ ఇచ్చారు. సమస్యల పరిష్కారం వైపు దృష్టి సారించి ఆదోని అభివృద్ధి వైపు అడుగులు వేద్దామని ఇన్‌ఛార్జీ మున్సిపల్ ఛైర్మన్ ముల్లా మహ్మద్ గౌస్ తెలిపారు. ఆదోని అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఇప్పటి నుంచి అన్ని మంచి రోజులే అని వైస్ ఛైర్మన్ నరసింహులు తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, హెల్త్ ఆఫీసర్ సందీప్, రెవెన్యూ ఆఫీసర్ యాసిన్ బాష, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, కౌన్సిలర్లు లోకేశ్వరి, బాలాజీ, అశోక్, ఫయాజ్, లక్ష్మీదేవి, లలితమ్మ, ఇందు ఉన్నారు.


మాట్లాడుతున్న కౌన్సిలర్ సందీప్ రెడ్డి

కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు విడనాడాలి

- 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి
- కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను విడనాడాలని సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఎఐకెఎంఎస్ తాలూకా నాయకులు బి.రాముడు, కె.తిమ్మగురుడు, ఎస్.రాజు, ఎస్.బాలరాజు, కె.హనీఫ్, పి.వెంకటేశ్వర శెట్టి డిమాండ్ చేశారు. మంగళవారం వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాలుగు లేబర్ చట్టాల రద్దు కోసం ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని 14న ఎన్‌జిఒస్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆదోని : నెలకు రూ.26 వేలకు వేతనం పెంచాలని, ఈనెల 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలోకి వెళ్తామని అంగన్వాడీలు తెలిపారు. ఆదోని సిడిపిఒ కార్యాలయంలో అంగన్వాడీల సమస్యలపై సూపర్‌వైజర్ లీలావతికి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన్న, అంగన్వాడీ యూనియన్ నాయకులు పద్మ, వరలక్ష్మి, సరోజ మాట్లాడారు. ఈనెల 20న అన్ని కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాత కార్మిక చట్టాన్ని అమలు చేసి, 8 గంటల పని విధానం కొనసాగించాలని కోరారు. దేశవ్యాప్తంగా జరిగే సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, ప్రతి అంగన్వాడీ సమ్మెలో పాల్గొంటామన్నారు. **మంత్రాలయం** సిడిపిఒ నరసమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి టి.భీమేశ్వరి, నాయకులు హెచ్.జయరాజు మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీల అధికారాలు మారుతున్నా కార్మికులు, కష్టజీవుల బతుకులు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, పాత పింఛను విధానం అమలు చేయాలని కోరారు. ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను అసంఘటిత కార్మికులు, కర్షకులు, రైతులు, వ్యవసాయ కూలీలు కలిసి జయప్రదం చేయాలని కోరారు. అంగన్వాడీ టీచర్లు కల్యాణి, శ్వేత, ప్రమీల, ఆశావర్కర్లు శారద, లక్ష్మి, భవన నిర్మాణ కార్మికులు దానియేల్, తిక్కయ్య, రామారావు పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో ఆహ్వాన పత్రాలు అందిస్తున్న నాయకులు


ఆదోని ఐసిడిఎస్ అధికారిణికి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు



మంత్రాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కౌన్సిల్‌లో అవమానించారు

- టిడిపి కౌన్సిలర్ ఆవేదన

ప్రజాశక్తి - ఆదోని



వార్డులో సమస్యలు తెలుపుదామని ప్రయత్నించినా పదేపదే అడ్డుపడుతూ వైసిపి కౌన్సిలర్లు తనను అవమానపరిచారని 1వ వార్డు కౌన్సిలర్ (టిడిపి) పార్వతి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ ఇన్‌ఛార్జీ ఛైర్మన్ ముల్లా మహ్మద్ గౌస్ అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశం జరిగింది. కార్యాలయం ముందు ఆమె భర్త వెంకటేష్‌తో కలిసి మాట్లాడారు. పశువుల సంత మార్కెట్‌కు మరింత ఆదాయం వస్తుందని రద్దు చేసి తిరిగి టెండర్లు నిర్వహించాలని మార్చి 29న కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. కనీసం పరిగణనలోకి కూడా తీసుకోకుండా కమిషనర్ నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అజెండాలో పొందుపరిచిన పశువుల సంత మార్కెట్ అంశాన్ని కౌన్సిల్‌లో లేవనెత్తగానే 'పాస్.. పాస్' అంటూ అనుకూలంగా తీర్మానం చేయడం ఏమిటని నిలదీశారు. పోడియం వద్దకు వెళ్లి వైస్ ఛైర్మన్ నరసింహులుకు విషయం చెబుతున్నా కనీసం పట్టించుకోకుండా అజెండాను చదివించడం అవమానంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. పశువుల సంత వ్యవహారంలో చేయి తడిపారన్న అనుమానం కలుగుతోందని తెలిపారు. టిడిపి కౌన్సిలర్‌గా ఉండి కూడా తన వార్డులో కనీసం రూ.5 లక్షల పని కూడా చేయలేదని, గతంలో ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు కూడా మంచి రోజులు రాలేదని చెప్పారు. అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న నాయకులు

నెల రోజులైనా అందని తాగునీరు

- సిపిఎం బృందం పాదయాత్ర

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండలంలోని పెద్దపెండేకల్లు, చిన్నపెండేకల్లు, బసరకోడు, అలసందగుత్తి, సలకలకొండ, సాంబగల్లు, నెట్టికల్లు గ్రామాలకు నెల రోజులైనా తాగునీరు సరఫరా కావడం లేదని, తమను మనుషులుగా కూడా ప్రభుత్వం చూడడం లేదని గ్రామస్తులు సిపిఎం పాదయాత్ర బృందం ముందు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దతుంబలం నుంచి ప్రారంభమైన పాదయాత్ర మూడో రోజు మంగళవారం ఆయా గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, మండల కార్యదర్శి వర్గసభ్యులు జె.రామాంజనేయులు, ఎం.ఉచ్చీరప్ప, మండల నాయకులు అయ్యప్ప మాట్లాడారు. ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కావాలంటే పోరాటమే ఏకైక మార్గమని తెలిపారు. అందుకోసమే సిపిఎం 22 గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి 14న ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం శాఖ కార్యదర్శులు శ్రీనివాసులు, రంగనాథ్, రామాంజనేయులు, పార్టీ సభ్యులు గోపాల్, మునిస్వామి, భీమాంజనేయులు పాల్గొన్నారు.

అదనపు ఆర్థిక సహాయాన్ని వినియోగించుకోవాలి

- గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి
- హౌసింగ్ పీడీ చిరంజీవి

ప్రజాశక్తి- గోనెగండ్ల

ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే అదనపు ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొని గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ చిరంజీవి తెలిపారు. మంగళవారం గోనెగండ్లలోని ఎంపిడిఒ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బంది, మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 12న రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల గృహ ప్రవేశాలు చేపట్టనుందని, అందులో భాగంగా కర్నూలు జిల్లాలో 11,706 గృహ నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. మండలానికి సంబంధించి 404 ఇళ్ల నిర్మాణాలకు గాను 93 పూర్తి చేశారని, మిగతావి కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం గృహ నిర్మాణానికి గతంలో ఇచ్చే రూ.1.80 లక్షలు, అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందిస్తోందని తెలిపారు. లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వీలైనంత త్వరగా గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. హౌసింగ్ డిఇ ఎస్‌వి.ప్రసాద్, ఎంపిడిఒ మణిమంజరి, హౌసింగ్ ఎఇ షేక్షావలీ, ఎపిఒ మహ్మద్ బాష పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

ఐసిడిఎస్ కార్యాలయ నిర్మాణానికి స్థల సేకరణ

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో ఐసిడిఎస్ కార్యాలయ నిర్మాణానికి స్థల సేకరణ పూర్తయినట్లు సిడిపిఒ నరసమ్మ తెలిపారు. మంగళవారం సర్పంచి తెల్లబండ్ల భీమయ్య చొరవతో స్థలం పరిశీలించామని పేర్కొన్నారు. బృందావన రియల్ ఎస్టేట్ వారు పంచాయతీకి కేటాయించిన స్థలంలో 10 సెంట్లు ఇవ్వడానికి అంగీకరించారని తెలిపారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని, రెండు రోజుల్లో పంచాయతీ ఆమోదంతో ధ్రువీకరించి సంబంధిత పత్రాలు ఐసిడిఎస్ సిడిపిఒకు అందజేస్తామ ని సర్పంచి భీమయ్య తెలిపారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి బాయి, గంగపుత్రుల సంఘం అధ్యక్షులు హండే శాంతయ్య, జీనియస్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.రాఘవేంద్ర ఉన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

- ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన

ప్రజాశక్తి - చిప్పగిరి

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన తెలిపారు. మంగళవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో సూపర్‌వైజర్ ప్రసూన ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలో అంగన్వాడీ టీచర్లు నిర్వహించిన కిశోర వికాసం కార్యక్రమంలో బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కిశోర బాలికల సాధికారత అందరి బాధ్యత అని తెలిపారు. 12 నుంచి 18 ఏళ్ల బాలికలకు వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. చిన్న వయస్సులో గర్భం దాల్చడంతో మాత, శిశు మరణాలకు, ఇతర ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. అందుకు సంబంధించి బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సచివాలయ ఎఎన్ఎం సువర్ణ, మహిళా సంరక్షకులు పావని, అంగన్వాడీ టీచర్లు బాల రంగమ్మ, వన్నూరమ్మ, పార్వతమ్మ, ఆశాలు ఈరమ్మ, కవిత పాల్గొన్నారు. **దేవనకొండ** అంగన్వాడీ కేంద్రం-1లో కిశోర బాలికలకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కిశోర వికాసం శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల, ఆస్పరి డివిజన్ సిడిపిఒ మద్దమ్మ పాల్గొని పోక్సో చట్టం, బాల్య వివాహాలు, ఆరోగ్య జాగ్రత్తలు, పోషక ఆహారం తదితర అంశాల గురించి వివరించారు. సూపర్ వైజర్లు శివలింగమ్మ,, షాహినా, ఎపిఎం నరసన్న పాల్గొన్నారు.


చిప్పగిరిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బంది

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహానంది


సమావేశంలో మాట్లాడుతున్న మహానంది

ప్రజాశక్తి - చిప్పగిరి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుడిసె మహానంది డిమాండ్ చేశారు. మంగళవారం చిప్పగిరిలో ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో అబద్ధాలు చెప్పి అధికారం చేపట్టి సంవత్సరం కావస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వస్తే ఆలూరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని వేదవతి, నగరడోనా ప్రాజెక్టులు పూర్తిచేసి అభివృద్ధి చేస్తామని చెప్పి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో టిడిపి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యమన్నారు. ఆలూరు అభివృద్ధి ఎమ్మెల్యే బి.విరుపాక్షితో సాధ్యమని చెప్పారు. ఆస్పరి వైస్ ఎంపిపి తనయుడు ప్రకాష్ యాదవ్, రంగప్ప, హరి, బంగారు పాల్గొన్నారు.